# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 24 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## మేడారం జాతరకు నిధులు విడుదల

- రూ.3.70 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో కేంద్ర పర్యాటక, గిరిజన శాఖలు రూ.3.70 కోట్లు విడుదల చేశాయి. కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మేడారం చుట్టుపక్కల ఉన్న ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'గిరిజన సర్క్యూట్ పేరిట' గతంలో రూ.80 కోట్లతో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించింది. పలు అభివృద్ధి పనులను కూడా చేపట్టింది. యునెస్కో గుర్తింపు లభించిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రూ.140 కోట్లు ఖర్చు చేస్తోంది. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు బంగారం (బెల్లం) సమర్పిస్తారు. భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను కూడా నడుపుతోంది.

# జనగణనకు అంతా సిద్ధం

- సన్నాహాలు పూర్తి
- రెండు దశల్లో నిర్వహణ
- జనగణనతోపాటు కులగణనకు కేంద్రం నిర్ణయం
- 33 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం




**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన–2026కు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రెండు దశల్లో జనగణన చేపట్టనున్నట్లు ఇప్పటికే కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ జనగణనలోనే కులగణనను కూడా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

2026 ఏప్రిల్ 1 నుంచి తొలి దశ జనగణన ప్రారంభం కానుంది. తొలి దశలో గృహ గణన చేపట్టనుండగా, ఇందుకు సంబంధించిన ప్రశ్నావళిని కేంద్ర హోంశాఖ సిద్ధం చేసింది. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్‌ను మోదీ ప్రభుత్వం విడుదల చేసింది.గృహ గణనలో ఇంటి నిర్మాణ వివరాలతో పాటు ఇంట్లో ఇంటర్‌నెట్ వినియోగం, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, వాహనాల వినియోగం వంటి అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాలని కేంద్రం ఆదేశించింది. కుటుంబంలో ఉన్న సభ్యులు ఎవరు, వారు ఏ వృత్తిలో ఉన్నారు అనే వివరాలను కూడా ఖచ్చితంగా నమోదు చేయాలని గణన అధికారులకు స్పష్టం చేసింది. అలాగే ఇంట్లో ఉపయోగిస్తున్న మరుగుదొడ్డి రకం, స్నానాల కోసం ఉన్న బాత్‌రూం విధానం, వంట కోసం వాడుతున్న గ్యాస్ కనెక్షన్ వివరాలు కూడా గణనలో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించింది. ఇంటి యజమాని ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర వర్గాలకు చెందినవారా అనే వివరాలను కూడా కచ్చితంగా రికార్డుల్లో పొందుపరచాల్సి ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కోసం ఈ జనగణన ఎంతో కీలకమని కేంద్ర అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### సర్వేయర్లు అడిగే ముఖ్య ప్రశ్నలు ఇవే..

**ఇంటి నిర్మాణ వివరాలు:**

ఇంటి గోడలు, పైకప్పు, ఫ్లోరింగ్?కు ఉపయోగించిన పదార్థాలు ఏవీ అనే వివరాలను నమోదు చేస్తారు.

**నివాస సమాచారం:**

ఇంటి సంఖ్య, ఇంటి యాజమాన్య స్థితి, కుటుంబంలో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య, గదుల సంఖ్య వంటి వివరాలను సేకరిస్తారు.

**కుటుంబ పెద్ద వివరాలు:**

ఇంటి యజమాని పేరు, వారు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు లేదా ఇతర వర్గాలకు చెందినవారా అనే సమాచారం నమోదు చేస్తారు.

**కనీస వసతులు:**

తాగునీటి వనరు, నీటి లభ్యత, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్డి రకం, డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన వివరాలను రికార్డు చేస్తారు.

**వంటగది వివరాలు:**

వంట కోసం ఉపయోగిస్తున్న ఇంధనం ఏది, వంటగది సౌకర్యం ఉందా లేదా అనే అంశాలపై సమాచారం సేకరిస్తారు.

**డిజిటల్ ఆస్తులు -- ఇతర వినియోగ వస్తువులు**

ఇంట్లో ఉన్నరేడియో, ట్రాన్సిస్టర్, టెలివిజన్
ఇంటర్నెట్ సౌకర్యం, ల్యాప్?టాప్, కంప్యూటర్
మొబైల్ ఫోన్, స్మార్ట్?ఫోన్
**సైకిల్, స్కూటర్, కారు లేదా వ్యాన్**

వంటి వస్తువుల వివరాలను నమోదు చేస్తారు. అలాగే కుటుంబం ప్రధానంగా వినియోగించే తృణధాన్యాల వివరాలు కూడా సేకరిస్తారు.

**ఎంతమందికి ఒక సర్వేయర్?**

ఈ బృహత్తర కార్యాన్ని నిర్వహించేందుకు భారత రిజిస్ట్రార్ జనరల్ కఠిన నిబంధనలు రూపొందించారు.

**సర్వేయర్లు:** 1990 జనాభా లెక్కల చట్టం ప్రకారం ఉపాధ్యాయులు, ప్రభుత్వ గుమస్తాలు, స్థానిక అధికారులను ఎన్యూమరేటర్లుగా నియమిస్తారు.

**పని భారం:** ప్రతి సర్వేయర్?కు 700 నుంచి 800 మంది జనాభాను లెక్కించే బాధ్యత ఉంటుంది.

పర్యవేక్షణ: ప్రతి ఆరుగురు సర్వేయర్లకు ఒక సూపర్?వైజర్ ఉంటారు. అత్యవసర పరిస్థితుల కోసం 10 శాతం అదనపు సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతారు.

**అధికారులు:** జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్లు, మేజిస్ట్రేట్లు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు.

**రెండవ దశ ఎప్పుడు?**

తొలి దశ గృహ గణన పూర్తైన తర్వాత, రెండవ దశలో అసలైన జనాభా గణన చేపడతారు. దీనికి సంబంధించిన ప్రత్యేక షెడ్యూల్?, నోటిఫికేషన్?ను తర్వాత విడుదల చేస్తామని కేంద్ర

# ఏడు గంటలు విచారణ

- ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ ఆరా
- జూబ్లీహిల్స్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై జరిగిన సిట్ విచారణ గురువారం ముగిసింది. దాదాపు ఏడు గంటల పాటు కొనసాగిన ఈ విచారణలో కేసుకు సంబంధించిన పలు కీలక అంశాలపై సిట్ అధికారులు ప్రశ్నలు సంధించి, కేటీఆర్ వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ప్రధానంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కోట్లాది రూపాయలు సేకరించడం, ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ అంశాలపై సిట్ కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించిందని సమాచారం. ఫోన్‌ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ సిట్ ఇచ్చిన నోటీసు మేరకు శుక్రవారం ఉదయం 10:50 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి కేటీఆర్ భారీ ర్యాలీగా చేరుకున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్ గురువారం ఉదయం తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి పలువురు నాయకులు భారీ సంఖ్యలో కార్యకర్తలతో కేటీఆర్ ఊరేగింపుగా రావడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి 200 అడుగుల దూరంలోనే కార్యకర్తలు, ఇతర నాయకులను పోలీసులు ఆపేశారు. కేవలం కేటీఆర్ కారును మాత్రమే ఏసీపీ కార్యాలయంలోకి అనుమతించారు. దాంతో పెద్ద ఎత్తున పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ రోడ్డు మీదనే బైటాయించారు. ఏసీపీ కార్యాలయంలోకి ప్రవేశించిన కేటీఆర్‌ను అప్పటికే వేచి ఉన్న సిట్ అధికారులు ఆయనను ప్రత్యేక గదిలో కూర్చోబెట్టి కొద్ది సేపటి తర్వాత ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ విచారణలో డీసీపీలు రితురాజ్, నారాయణ్‌రావు, ఏసీపీలు వెంకటగిరి, శ్రీధర్ తదితరులు పాల్గొనగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజన విరామం ఇచ్చాక.. సాయంత్రం వరకు కేటీఆర్‌కు పలు ప్రశ్నలను సిట్ అధికారులు సంధించినట్టు తెలిసింది. కొన్నింటికి సమాధానమిచ్చిన కేటీఆర్ మరికొన్ని ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు వేస్తూ పోయారని సమాచారం. మొత్తమ్మీద ఏడు గంటలకు పైగా కేటీఆర్‌ను విచారించిన సిట్ అధికారులు.. ఆ సమాచారాన్ని పూర్తిగా రికార్డు చేసినట్టు తెలిసింది. చివరగా విచారణ కొనసాగుతున్నదనీ, అవసరమైతే మరోసారి పిలుస్తామని సిట్ అధికారులు కేటీఆర్‌కు తెలిపి పంపించి వేశారని సమాచారం. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చిన కేటీఆర్‌ను చూసి, బయట వేచి ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున 'కేటీఆర్ జిందాబాద్', 'పోలీస్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. వారి నినాదాల మధ్య కారెక్కిన కేటీఆర్.. తన కాన్వాయ్‌తో వెళ్లారు.

# సింగరేణి కుంభకోణంలో సీఎం బావమరిది కింగ్‌పిన్



- అన్ని ఆధారాలున్నా సిట్ ఎందుకు విచారించదు
- అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాలక్షేప కథాచిత్రాలు
- సిట్ అధికారులు ఎందుకు లీకులు ఇస్తున్నారు
- తప్పుడు వార్తలు ప్రచారం చేయవద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సింగరేణి కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది కింగ్‌పిన్‌గా ఉన్నాడనే విషయానికి అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, సిట్ ఎందుకు విచారణ చేపట్టడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, తాను అడిగిన ప్రశ్నలకు సిట్ అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా నీళ్లు నమిలారని ఆరోపించారు. "రెండేళ్ల అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాలక్షేప కథాచిత్రాలు నడుపుతున్నారు" అని విమర్శించారు. సిట్ అధికారులు ఎందుకు లీకులు ఇస్తున్నారని తాను ప్రశ్నించానని, విచారణకు పూర్తిగా సహకరించినప్పటికీ పదే పదే అదే ప్రశ్నలు అడిగి చిరాకు తెప్పించారని తెలిపారు.

హీరోయిన్ల పేర్లతో తమపై దుష్ప్రచారం జరుగుతోందని, వారి ఫోన్లు ట్యాప్ చేశామన్న ప్రచారం నిజమేనా అని సిట్‌ను ప్రశ్నించినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చాయని అడిగితే, అలాంటి వార్తలను తామే మీడియాకు చెప్పలేదని సిట్ అధికారులు సమాధానం ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం తమ ఫోన్లు కూడా ట్యాప్ అవుతున్నాయా అని అడిగినా, అధికారులు స్పష్టత ఇవ్వలేదని ఆరోపించారు.

తప్పుడు వార్తలు ప్రచారం చేయవద్దని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేస్తూ, "మాకూ కుటుంబాలు ఉన్నాయి" అని కేటీఆర్ అన్నారు.

సింగరేణి టెండర్లలో దొంగలు దొరికినా చర్యలు ఎందుకు లేవని కేటీఆర్? ప్రశ్నించారు. హరీష్? రావు ఆధారాలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, స్వయంగా మంత్రి కుమారుడు గూండాగిరి చేస్తున్నా ప్రభుత్వం చూస్తూ ఊరుకుందన్నారు. సీఎం బావమరిది కింగ్‌పిన్‌గా ఉన్నాడనే ఆధారాలు ఇచ్చినా, అతనిపై సిట్? విచారణ ఎందుకు లేదని నిలదీశారు.

"మమ్మల్ని విచారించిన విషయాలను మాత్రం లీకులుగా వండి మీడియాకు ఇస్తున్నారు. న్యాయం, ధర్మం, ఖాకీ బుక్ అందరికీ ఒకేలా ఉండాలి" అని కేటీఆర్? స్పష్టం చేశారు. ఈ రోజు తనను ఎవరితోనూ కలిసి విచారించలేదని, విచారణ సమయంలో తన పక్కన ఎవరూ లేరని కేటీఆర్? తెలిపారు. "ఈరోజు విచారణలో నేను తప్ప ఇంకెవ్వరూ లేరు" అని ఆయన పేర్కొన్నారు.

## బంగారం ధర పైపైకే...

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బంగారం ధర మెరుపులు కొనసాగుతూనే ఉన్నాయి. పసిడి, వెండి ధరలు వారాంతం సెషన్‌లో మరో కొత్త రికార్డ్‌ను సృష్టించాయి. శుక్రవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,840 ఎగిసి రూ.1,57,300కు చేరింది. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన పసిడి రూ.2,600 ప్రియమై రూ.1,44,200గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.15,000 పెరిగి రూ.3.40 లక్షలకు చేరింది. దీంతో 10 గ్రాముల వెండి ధర రూ.3400గా నమోదయ్యింది. ట్రంప్ టారిఫ్ ఉన్మాదానికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చినప్పుడు రూపాయి రికార్డ్ పతనం పసిడి ధరలకు ఆజ్యం పోస్తోన్నాయి.

# షోరూమ్‌లలోనే వాహనాల రిజిస్ట్రేషన్

- ప్రారంభించిన రవాణా శాఖ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు ఇకపై ప్రాంతీయ రవాణా కార్యాలయాలు (ఆర్టీఓ) చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని రవాణా శాఖ ప్రకటించింది. ఆటోమొబైల్ షోరూమ్‌లలోనే వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తిచేసే కొత్త విధానాన్ని అధికారికంగా ప్రారంభించింది. ఈ కొత్త వ్యవస్థ జనవరి 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది.

ఇటీవల నగరంలోని ఓ ఆటోమొబైల్ షోరూమ్‌లో నిర్వహించిన పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైంది. ఈ పరీక్షా దశలో ఓ నాలుగు చక్రాల వాహనాన్ని కొత్త డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి, నేరుగా వినియోగదారుడికి డెలివరీ చేశారు. దీంతో ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలుకు సిద్ధంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు.రవాణా శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, జనవరి 24 నుంచి కొనుగోలు చేసిన వాహనాలకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుంది. కొత్త విధానంలో భాగంగా, అధీకృత డీలర్లు వాహన యజమానుల తరఫున ఆన్‌లైన్‌లో శాశ్వత రిజిస్ట్రేషన్ దరఖాస్తులు సమర్పిస్తారు. వాహన కొనుగోలు బిల్లు, చట్టపరమైన ఫారమ్‌లు, బీమా వివరాలు, చిరునామా ధ్రువీకరణ పత్రాలు, వాహన ఫొటోలు వంటి అవసరమైన పత్రాలను డిజిటల్‌గా అప్‌లోడ్ చేస్తారు.

పత్రాల పరిశీలన అనంతరం రవాణా శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారు. అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ)ను స్పీడ్ పోస్టు ద్వారా వాహన యజమానికి పంపిస్తారు. ఈ కొత్త విధానం వల్ల ప్రజల సమయం ఆదా కావడంతో పాటు, ఆర్టీఓ కార్యాలయాల్లో రద్దీ తగ్గుతుందని, వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా జరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఈ సౌకర్యం ద్విచక్ర వాహనాలు, కార్లు వంటి నాన్-ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని, వాణిజ్య వాహనాలకు ఇది వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. ఈ విధానం అమలులో భాగంగా, రవాణా కమిషనర్ రాష్ట్రంలోని 33 జిల్లాల రవాణా అధికారులతో ఆన్‌లైన్ సమీక్ష సమావేశం నిర్వహించి, అమలు విధానం మరియు తలెత్తే సాంకేతిక సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

## నేటి నుంచి బడ్జెట్ సన్నాహక సమావేశాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర బడ్జెట్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కసరత్తు ఇప్పటికే ప్రారంభమైంది. శనివారం నుంచి శాఖల వారీగా ఆర్థిక శాఖ సన్నాహక సమావేశాలను నిర్వహించనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఈ సమావేశాలు సచివాలయంలో జరుగుతాయి. ఆయా శాఖల మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులు, ఆయా శాఖల విభాగాధిపతులతో వచ్చేనెల ఐదో తేదీ వరకు ఈ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆర్థిక శాఖ ఇప్పటికే విడుదల చేసింది. సంక్షేమ పథకాలకు సంబంధించి నిధుల కేటాయింపుపై కీలకంగా చర్చ జరగనుంది. ఏయే సంక్షేమ పథకానికి ఎన్ని నిధులు కేటాయించాలో శాఖల వారీగా ప్రతిపాదనలను ఆర్థిక శాఖ స్వీకరిస్తుంది. తొలిరోజు శనివారం ఉదయం వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశం ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి అనసూయ సీతక్కతో సమావేశాన్ని నిర్వహిస్తారు. 27న ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సమావేశం ఉంటుంది. చివరి రోజు వచ్చేనెల ఐదున ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖలపై బడ్జెట్ సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తారు.

# కేటీఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం




- ఫోన్ ట్యాపింగ్‌పై ఆత్మపరిశీలన చేసుకోవాలి
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ తనపై వ్యక్తిగత హననం జరుగుతోందని చెప్పడం పూర్తిగా హాస్యాస్పదమని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజ్యాంగబద్ధంగానే విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకునేవాళ్లమని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై కేటీఆర్ ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణలను వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్టేనని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. 'బట్ట కాల్చి మీద వేసి పారిపోతామంటే కుదరదు. అలీబాబా 420 దొంగల మాదిరిగా కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంది. స్టువర్ట్ పురం దొంగల బ్యాచ్‌లా బీఆర?స్ వ్యవహరించింది' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతో 'ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం' అంటూ కేటీఆర్ రాగాలు తీస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి తీవ్రమైన అంశాన్ని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని ఆమె స్వయంగా చెబుతుంటే, కేటీఆర్ సమాధానం చెప్పలేకపోతున్నారని విమర్శించారు. బీఆర?స్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని, తన స్నేహితుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని వెల్లడించారు.కవితను చెల్లెలుగా ఎప్పుడూ గౌరవిస్తానని, అయితే కేసీఆర్ కుటుంబంలో తగాదాలకు మూలం వాటాల పంపకంలో తేడానేనని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కవిత నిజాలు మాట్లాడుతున్నందుకు స్వాగతిస్తున్నామని తెలిపారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మార్పు లేదని కూడా ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**కవిత కాంగ్రెస్‌లో చేరుతానంటున్నారు కానీ అవసరం లేదు**

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "కవిత మా పార్టీలో చేరుతానని చెబుతున్నారు. ఆమె వైపు నుంచి ప్రతిపాదనలు వస్తున్నాయి" అని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. అయితే, ఆమె చేరికకు తానే అభ్యంతరం తెలుపుతున్నానని స్పష్టం చేశారు. "కవితను కాంగ్రెస్?లో చేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు" అని తేల్చి చెప్పారు.

## తప్పుడు కథనాలు ప్రచారం చేయొద్దు

- నిష్పక్షపాతంగా ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు
- హైదరాబాద్ సీపీ సజ్జనార్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌ను సిట్ అధికారులు విచారించినట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా ఉదయం 11 గంటలకు కేటీఆర్ సిట్ విచారణకు హాజరయ్యారని తెలిపారు. కేసుకు సంబంధించిన కీలక అంశాలను సేకరించడంతో పాటు, ఇప్పటికే రికార్డులో ఉన్న సాక్ష్యాధారాలతో వాటిని విశ్లేషిస్తున్నామని పేర్కొన్నారు. విచారణ సందర్భంగా సాక్షులను ఎవరినీ సంప్రదించవద్దని, ప్రభావితం చేయొద్దని కేటీఆర్?కు సూచించినట్లు తెలిపారు. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని కూడా స్పష్టం చేశారు. క్రైమ్ నంబర్ 243/2024కు సంబంధించిన అంశాలపైనే శుక్రవారం విచారణ జరిగిందన్నారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖులతో పాటు వేలాది మంది పౌరుల ఫోన్లను అనధికారికంగా, చట్టవిరుద్ధంగా ఇంటర్‌సెప్షన్, నిఘా చేశారన్న విస్తృత ఆరోపణలకు సంబంధించిన కేసు ఇదని సీపీ సజ్జనార్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ భద్రతా కారణాల కోసమే జరిగిందని, ఇందులో ఎలాంటి చట్టవ్యతిరేకత లేదని కొన్ని మీడియా వర్గాలు నిరాధారమైన, తప్పుదోవ పట్టించే కథనాలు ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.సిట్‌కు ఇటువంటి తప్పుడు ప్రచారాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ దర్యాప్తు పూర్తిగా చట్టప్రకారం, నిష్పక్షపాతంగా, వృత్తిపరమైన ప్రమాణాలతో కొనసాగుతోందని తెలిపారు. ధ్రువీకరణ లేని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారికంగా వెల్లడించే వాస్తవాలనే పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ కు సీపీ సజ్జనార్ లీగల్ నోటీసులు జారీ చేశారు. తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి రెండ్రోజుల్లో ఆధారాలు సమర్పించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సీపీ సజ్జనార్‌పై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయని ప్రవీణ్‌కుమార్ ఇటీవల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

# సింగరేణిలో బొగ్గు స్కాంతో పాటు సోలార్ స్కాం




- రేవంత్ బావమరిది వ్యవహారం బయటపెట్టినందుకే సిట్ నోటీసులు
- మాజీ మంత్రి హరీష్ రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సింగరేణి సంస్థలో బొగ్గు కుంభకోణంతో పాటు భారీ సోలార్ కుంభకోణం కూడా జరిగిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డి బావమరిది పాత్రను ఆధారాలతో సహా బయటపెట్టినందుకే తమకు సిట్ నోటీసులు పంపిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్?లో మీడియాతో మాట్లాడిన ఆయన, రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు."సిట్ విచారణపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. లోపల ఏదో జరుగుతున్నట్టుగా తప్పుడు లీకులు ఇస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. కట్టుకథలతో ఇంకెన్నాళ్లు ప్రభుత్వం నడుస్తుంది? రెండేళ్లు గడిచినా లీకుల రాజకీయాలేనా?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని హెచ్చరించారు.

మంత్రుల మధ్య వాటాల పంచాయితీ జరుగుతోందని, అదే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉరితాడుగా మారిందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి బావమరిది వ్యవహారం బయటపడడంతో ప్రభుత్వం కంటిమీద కునుకులేకుండా పోయిందని అన్నారు. "కుంభకోణం ఎలా బయటపడిందో అని తలలు పట్టుకుంటున్నారు" అని ఎద్దేవా చేశారు. సింగరేణి భూకుంభకోణం వల్ల తెలంగాణ ప్రతిష్ట మసకబారిందన్నారు.

సుజన్ రెడ్డి వ్యవహారం బయటపెట్టినందుకే తనకు, కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని హరీష్ రావు తెలిపారు. "కేటీఆర్ సిట్‌కు భయపడే వ్యక్తి కాదు. మేము భయపడేవాళ్లమైతే ఉద్యమాలు చేసేవాళ్లం కాదు. మేం ఈ అంశాన్ని బయటపెట్టిన వెంటనే ఢిల్లీ కోల్ మినిస్ట్రీ ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టింది" అని చెప్పారు.

సింగరేణిలో బొగ్గు స్కాం మాత్రమే కాకుండా 127 మెగావాట్ల సోలార్ స్కాం కూడా జరిగిందని హరీష్ రావు ఆరోపించారు. మూడు ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఎంఎస?ంఈలను పక్కనబెట్టి ఒకేసారి టెండర్లు పిలిచారని చెప్పారు. టెండర్ నిబంధనలను కఠినతరం చేసి, సైట్ విజిట్ వంటి అప్రయోజక షరతులు పెట్టారని విమర్శించారు.దేశవ్యాప్తంగా సోలార్ పవర్ ఒక్క మెగావాట్‌కు సుమారు రూ.3 కోట్ల ఖర్చు ఉంటే, తెలంగాణలో మాత్రం రూ.5 కోట్ల 4 లక్షలకు టెండర్ కట్టబెట్టారని ఆరోపించారు. దీంతో రూ.200 నుంచి రూ.250 కోట్ల మేర అక్రమాలు జరిగాయని, పైగా సింగరేణి భూములను కూడా ఉచితంగా అప్పగించారని పేర్కొన్నారు."నాడు యూపీఏ ప్రభుత్వాన్ని కూల్చిన కోల్ స్కాం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది పలికింది" అంటూ హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## జపాన్ పార్లమెంట్ రద్దు

**బలగం టీవి, టోక్యో**

జపాన్ పార్లమెంటును ఆ దేశ ప్రధాని తకాయిచి రద్దు చేశారు. ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేవలం మూడు నెలలకే ఆయన ఈ కీలక నిర్ణయం తీసుకు న్నారు. శుక్రవారం ప్రతినిధుల సభను రద్దు చేసి, ఫిబ్రవరి 8న ముందస్తు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టుగా ప్రకటిం చారని స్థానిక మీడియా సంస్థ పేర్కొంది. తన ఆర్థిక భద్రతా విధాన ఎజెండాకు ప్రజల మద్దతు కోరుతూ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 465 మంది సభ్యులున్న దిగువ సభను రద్దు చేసి, ఈ నిర్ణయం తీసుకోవడం 60 ఏండ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా కె. సంపత్ కుమార్ బాధ్యతలు

**బలగం టీవీ, వేములవాడ:**




వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా కె. సంపత్ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించి, మున్సిపల్ పరిపాలనపై సమీక్ష నిర్వహించారు. పట్టణాభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం అందించేందుకు పారదర్శక పరిపాలన అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్?కు శుభాకాంక్షలు తెలిపారు.




## టీబీ పేషెంట్లు పోషకాహారం నిత్యం తీసుకోవాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

టీబీ పేషెంట్లు కచ్చితంగా నిత్యం పోషకాహారం తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనీ అంబేద్కర్ నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ బాధితులకు పోషకాహార కిట్లు, కోడిగుడ్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. టీబీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లాలోని అన్ని పీహెచ్ సీలు, అర్బన్ హెల్త్ సెంటర్, ఏరియా హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బస్తీ దవఖానాల్లో ఆరోగ్య పరీక్షలు చేస్తారని, మందులు పంపిణీ చేస్తారని అన్నారు. ప్రతి నెలా రూ. వెయ్యి సహాయం అందిస్తున్నారని,పేషెంట్లు కచ్చితంగా మందులు వాడుతూ పోషకాహారం తీసుకోవాలని అన్నారు. టీబీ నియంత్రణకు నిక్షయ మిత్ర ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పట్టణాలు, మండలాల్లో కలిపి మొత్తం 353 మందికి పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రజిత, ఐఎంఏ అధ్యక్షురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



## ట్రై సైకిళ్ల పంపిణీ..

**బలగం టీవీ, తంగళ్లపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో దివ్యంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగెల రాజు చొరవతో మంజూరైన ఈ సైకిళ్లను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. సారాంపల్లి, దేశాయిపల్లి గ్రామాల్లోని పలువురు దివ్యంగులకు ట్రై సైకిళ్ల అవసరాన్ని గుర్తించిన మునిగెల రాజు, జిల్లా సంక్షేమ అధికారులతో మాట్లాడి వాటిని మంజూరు చేయించారు. మొదటి విడతలో భాగంగా దేశాయిపల్లి గ్రామంలో ఇద్దరు దివ్యంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. సారాంపల్లి గ్రామానికి మంజూరైన మరో ట్రై సైకిల్?ను రేపు అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. తమకు అండగా నిలిచి ట్రై సైకిళ్లు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి లకు దివ్యాంగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు గుగిళ్ల భారత్, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఎడ్ల తిరుపతి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు రాజిరెడ్డితో పాటు నాయకులు బాలరాజు, లింగారెడ్డి, దేవయ్య, కంకణాల తిరుపతి, శ్రీనివాస్, బి. బాబు, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
- **వ్యవసాయ ఆధునీకరణ యంత్రాలు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం**

**బలగం టీవీ, వేములవాడ:**



రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వ్యవసాయ శాఖ, స్త్రీ, శిశు, దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వేములవాడ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం వ్యవసాయ ఆధునీకరణ యంత్రాలు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు పరికరాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతును రాజుగా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు . రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్, మద్దతు ధరకు పంటల కొనుగోలు కోసం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలతో రైతులకు అండగా నిలుస్తున్నామని అన్నారు. వ్యవసాయ ఆధునీకరణ కోసం సబ్సిడీపై యంత్రాలు అందజేస్తున్నామని, అర్హులైన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, రెట్రోఫిటెడ్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు అందజేస్తోందని తెలిపారు. దివ్యాంగులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలు చేస్తూ, అన్ని పథకాలు హక్కుగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై ఆధునిక యంత్రాలు అందజేస్తోందన్నారు. పంటల మార్పిడి సాగు అవసరమని, ఆయిల్ పామ్ వంటి దీర్ఘకాలిక ఆదాయం ఇచ్చే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని అన్నారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు సహకారం అందిస్తారని భరోసా ఇచ్చారు. దివ్యాంగురాలు ఐరా సింఘాల్ యూపీఎస్సీ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించడం అందరికీ ప్రేరణనిచ్చేదని, జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు ఉపకరణాల కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు..

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
- **500 మంది టీబీ బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ**

**బలగం టీవీ, వేములవాడ:**



టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఐఎంఏ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాలోని సుమారు 500 మంది టీబీ బాధితులకు పోషకాహార కిట్లు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల చందుర్తి మండలంలో రూ.24 లక్షల వ్యయంతో మొబైల్ ఎక్స్?రే యూనిట్?ను ప్రారంభించామని,గ్రామీణ ప్రాంతాల్లో టీబీ రోగులను గుర్తించి వారి ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందిస్తున్నమని అన్నారు . టీబీ నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరు నెలల పాటు ఉచిత మందులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన సాంకేతికతతో వైద్య సేవలను విస్తరిస్తోందని, ప్రజలంతా ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బడికి వచ్చేలా.. పాఠ్యాంశాలపై అవగాహన కలిగేలా..




- **బుడి బుడి అడుగుల బాలలు బడికి ఆనందంగా వచ్చేలా.. వారికి పాఠ్యాంశాలపై అవగాహన కలిగేలా తీర్చిదిద్దారు బడిని..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పీఎంశ్రీ లో భాగంగా సమగ్ర శిక్ష కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో ప్రీ ప్రైమరీ సెక్షన్లు మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లిలో ప్రీ ప్రైమరీ విద్యాలయానికి నూతన హంగులతో సిద్ధం చేశారు. ప్రాథమిక విద్య అంశాలపై అవగాహన వచ్చేలా వివిధ రంగులతో చిత్రాలు, పెయింటింగులు, ఫర్నిచర్ ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఆ విద్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం సందర్శించారు. పిల్లల ఫ్రెండ్లీ చిత్రాలు, పెయింటింగ్ లు, ఫర్నిచర్ ఏర్పాటు చేయగా ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎందరు విద్యార్థులు చదువుతున్నారు? ఏమి ఏమి నేర్పిస్తున్నారో ఆరా తీశారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని పదమూడు మండలాల్లో ప్రీ ప్రైమరీ తరగతులు కొనసాగుతున్నాయి. అనంతరం అదే ఆవరణలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సైన్స్ కు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వార్షిక పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని సూచించారు. ఈ స్కూళ్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలని టీచర్లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ వినోద్ కుమార్, తహసిల్దార్ నారాయణరెడ్డి, ఎంపీఓ శ్రీధర్, డీఈఓ కార్యాలయ అధికారి శైలజ, సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్

**బలగం టీవి, ఆదిలాబాద్**



ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్?గా పనిచేస్తున్న కటకం విద్యాసాగర్ రెడ్డి తెలంగాణ అనిశా (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. ఫిర్యాదుదారుని పేరిట ఉన్న 8.35 ఎకరాల భూమికి సంబంధించిన సాదా బైనామా రిజిస్ట్రేషన్ దస్తావేజును ప్రాసెస్ చేసి పంపించేందుకు లంచం డిమాండ్ చేసిన విద్యాసాగర్ రెడ్డి, ఫిర్యాదుదారుని నుంచి రూ.2,00,000/- లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.సమాచారం అందుకున్న వెంటనే అనిశా అధికారులు వలపన్నించి ఈ దాడిని విజయవంతంగా నిర్వహించారు.ఈ ఘటనతో తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి కలకలం రేగింది.నిందితుడిపై కేసు నమోదు చేసి,తదుపరి విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

**బలగం టీవీ, ఖమ్మం**

ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి సైడ్ రైలింగ్‌ను ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ బి.హరిత తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కేఎస్ రామవరం గ్రామానికి చెందిన కొమ్ము సాయి(35) గట్టు రాంబాబు(32).. చింతలపూడి నుంచి ఖమ్మం వైపు గ్రీన్ ఫీల్డ్ హైవే మీద ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని లింగాల గ్రామం సమీపంలో హైవేపై ఏర్పాటు చేసిన రైలింగ్‌ను ఢీకొని ఇద్దరూ కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చరీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## మిషన్ భగీరథ అధికారులు

# సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి..

- **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి**
- **రాజన్న సిరిసిల్ల ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పర్యవేక్షణ చేశారు. సమావేశంలో సీఎం కప్ పోటీల నిర్వహణ, ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణం, మిషన్ భగీరథా కార్యక్రమాలపై చర్చ జరిగింది.ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మండలాలు, మున్సిపాలిటీలలో మిషన్ భగీరథ అధికారులు సమ్మర్ యాక్షన్ సిద్ధం చేయాలని, ప్రతి నెల 1, 11, 21 తేదీల్లో గ్రామ, నగర ట్యాంకులను పూర్తిగా ఖాళీ చేసి, బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయాలని,అవసరమైతే నిచ్చెన ఏర్పాటు, ఇతర ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు.

జిల్లాలో 32 క్రీడా విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు. గ్రామస్థాయి పోటీలు ఈ నెల 17--22, మండల, మున్సిపాలిటీ స్థాయి 28--31, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఫిబ్రవరి 3--5, జిల్లాస్థాయి ఫిబ్రవరి 9--12 తేదీలలో జరగనున్నాయని,ఎంపీడీవోలు గ్రామీణ క్రీడా ప్రాంగణాలను వినియోగించాలని అన్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణాలను రోజువారీ పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారులకు కావాల్సిన ఇట్లు, ఇతర సామగ్రి అందించాలని, నిర్మాణ పూర్తయిన వాటి ఫోటోలు అప్?లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాల్సిందని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీలలో నూతన మహిళా సంఘ భవనాల నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ ద్వారా 10 లక్షల రూపాయల నిధులు అందనున్నాయని, మ్యాచింగ్ గ్రాంట్ కింద గ్రామ పంచాయతీలు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 2025-26 సంవత్సరానికి ఐదు నెలల ఫౌండేషన్ కోర్సును వినియోగించాలని పిలుపునిచ్చారు. ఇది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు, బ్యాంకింగ్, క్ష్మక్మదీ, ౹ూజ తదితర పరీక్షలకు ఉపయోగపడుతుందని, అర్హులైన అభ్యర్థులు 30-01-2026 వరకు http://tsstudy-circle.co.in ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ గీత, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీవైఎస? రాందాస్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, హౌసింగ్ పీడీ శంకర్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు డిజిటల్ ఉపాధి అవకాశాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అల్పసంఖ్యాక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ అధికారి ఎం.ఎ. భారతి తెలిపారు. నిరుద్యోగ విద్యార్థులు, యువతను వివిధ ఇండస్ట్రీస్? మరియు ఉపాధి ఏజెన్సీలతో అనుసంధానించేందుకు ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఆధారిత 'ఐజుజు మొబైల్' యాప్?తో పాటు వెబ్ పోర్టల్?ను ప్రారంభించిందన్నారు. ప్రత్యేకించి మైనారిటీ కమ్యూనిటీకి చెందిన విద్యావంతులైన నిరుద్యోగ యువత ఈ డిజిటల్ సౌకర్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

డీఈఈటీ యాప్‌లో నమోదు చేసుకోవడానికి విద్యా అర్హతపై ఎటువంటి పరిమితి లేకుండా, అన్ని రకాల విద్యా మరియు సాంకేతిక అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులు తమకు అనుకూలమైన వృత్తులు, ఉద్యోగ అవకాశాలను సులభంగా గుర్తించే అవకాశం ఉందన్నారు. డీఈఈటీలో నమోదు చేసుకోవాలనుకునే అభ్యర్థులు తమ మొబైల్‌లో ప్లే స్టోర్ నుంచి 'డీఈఈటీ తెలంగాణ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఉద్యోగార్థిగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

## ప్రియురాలి పెళ్లి నిశ్చయం తట్టుకోలేక యువకుడి పై ప్రేమికుడు కత్తితో దాలిడి..

**బలగం టీవీ, గంభీరావుపేట:**

ప్రేమ వ్యవహారం గంభీరావుపేట మండల కేంద్రంలో రక్తపాతానికి దారి తీసింది. తాను ప్రేమించిన యువతికి వేరే వ్యక్తితో పెళ్లి నిశ్చయం కావడాన్ని జీర్ణించుకోలేక, గ్రామానికి చెందిన మహమ్మద్ అమన్ ఖాన్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అమన్ ఖాన్ తన తల్లిదండ్రులతో కలిసి యువతి ఇంటికి వెళ్లి గొడవకు దిగాడు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన దుంపల వినీత్‌తో వాగ్వాదం చోటుచేసుకోగా, "నీవు ఈ అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావు" అంటూ అమన్ ఖాన్ తనతో తెచ్చుకున్న కత్తితో వినీత్‌పై దాడి చేశాడు. దాడిలో వినీత్ మెడ, చేతులపై రక్తగాయాలు అయ్యాయి. వినీత్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమన్ ఖాన్‌తో పాటు అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు

## శ్రీ రాజరాజేశ్వర ముంపు బాధితుల సమస్యలపై కలెక్టర్‌కు బీజేపీ వినతి..



**బలగం టీవీ, బోయినిపల్లి:**

శ్రీ రాజరాజేశ్వర ముంపు గ్రామాల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కు వినతి పత్రం బిజెపి పార్టీ నాయకులు అందజేశారు. భారతీయ జనతాపార్టీ బోయినిపల్లి మండల శాఖ అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం ముంపు గ్రామాలైన నీలోజిపల్లి, కొదురుపాక, మానువాడ, వరదవెల్లి గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ని కలిసి వినతి పత్రం అందజేసిన బిజెపి మండల పార్టీ నాయకులు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారని బిజెపి పార్టీ మండల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్య మానేరు పోరాట కమిటీ ఉపాధ్యక్షులు కొండం శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర?రెడ్డి, సీనియర్ నాయకులు అన్నమల్ల మోహన్ బాబు, శరత్, సారంపల్లి రాజు, అనుముల నర్సయ్య, ఎర్ర మధుకర్, మహేశ్, సాయికుమార్, ఆంజనేయులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న ఆటో డ్రైవర్‌కు 5 ఏళ్ల జైలు

**బలగం టీవీ, సంగారెడ్డి**



మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారి పట్ల న్యాయస్థానాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఒక ఆటో డ్రైవర్‌కు సంగారెడ్డి జిల్లా కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది. 2020 సంవత్సరంలో ఎండీ సిరాజ్ అనే ఆటో డ్రైవర్ 1.5 కిలోల పొడి గంజాయిని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, నిందితుడిపై మోపబడిన ఆరోపణలు నిజమని నిర్ధారించారు. ఈ మేరకు నిందితుడు ఎండీ సిరాజ్‌కు 5 సంవత్సరాల కఠిన జైలు శిక్ష రూ. 25,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. మత్తు పదార్థాల విక్రయాలు మరియు రవాణాపై పోలీసులు తీసుకుంటున్న కఠిన చర్యలు, కోర్టులు విధిస్తున్న శిక్షలు సమాజంలో ఇటువంటి నేరాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తున్నాయి.

## ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలు..

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఆర్ఓడి. సుజాత; విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలను నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల రెవెన్యూ అధికారి (వీక్ష్మఉ) డి. సుజాత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఎంఆర? సుజాత మాట్లాడుతూ.. దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప దేశభక్తుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. నేటి యువత నేతాజీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని



నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఆర? చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. సామాజిక దృక్పథంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సేవా సమితి సభ్యులను ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ అనగోని శ్రవణ్, కళాశాల ప్రిన్సిపాల్ కొక్కల్ల వీర ప్రభాకర్, నేతాజీ సేవా సమితి అధ్యక్షులు చెట్కూరి దినేష్ గౌడ్, సభ్యులు మారవేణి రంజిత్ కుమార్, వరుస రాకేష్, అజ్మీరా విశ్వనాథ్, కానమనేని వినయ్, మనుక రాజు, బుర్రవేణి ప్రవీణ్, శ్రీపాద విశ్వం చారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ న్యూటల్ సమస్యను పరిష్కరించిన ఇల్లంతకుంట సర్పంచ్ రాజు.

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**



ఇల్లంతకుంట మండలకేంద్రంలోని సమ్మక్క-సారలమ్మ వద్దకు గత కొన్ని సంవత్సరాలుగ సరైన విద్యుత్ రావాలంటే న్యూటల్ సమస్య ఉండడంతో తక్షణమే స్పందించిన స్థానిక సర్పంచ్ మామిడి రాజు మండల సెస్ ఏ.ఈ నగేష్ కుమార్ తో మాట్లాడి విద్యుత్ న్యూటల్ వైర్ లైన్ ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ సమస్య గురించి అడగగానే సమస్యను పరిష్కరించిన సర్పంచ్ రాజుకు సమ్మక్క-సారలమ్మ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ లైన్ మెన్ ఎల్లయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమం.


**బలగం టీవీ, బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని మండల విద్య వనరుల కేంద్రంలో గురువారం రోజున ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యంగా విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. బహుమతుల ప్రధాన కార్యక్రమానికి దివ్యాంగ విద్యార్థులు తల్లిదండ్రులు హాజరుకాగా, విద్యార్థులతో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారికి ఉత్సాహం నింపుతూ ముందుకు వెళ్ళేలా చూడాలని అన్నారు.ఎప్పుడు కూడా వారు మేము అవిటి వారము అనే ఆలోచన రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణరెడ్డి, మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్, సర్పంచ్ నల్లమోహన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నాయకులు మెరుపుల జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ అనుముల భాస్కర్

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ గురువారం రోజున మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్?ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సానుకూలంగా కేటీఆర్ స్పందించారని సర్పంచ్ అనుముల భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఈ నెల 26వ తేదీన భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ పై జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించేందుకు గ్రౌండ్, డయాస్ ను రెవెన్యూ అధికారులు పూల అలంకరణతో సిద్ధం చేయాలని సూచించారు. వేడుకల సందర్బంగా ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, వారికి ఆహ్వానం పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన స్టాళ్లు, శకటాల ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి అధికారులను నియమించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్బంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు వీలుగా, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని జిల్లా ప్రణాళిక అధికారికి సూచించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఆ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ సిబ్బంది ఉండాలని పేర్కొన్నారు. గ్రౌండ్ లో పారిశుధ్య పనులను సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. వేడుకల సందర్బంగా గ్రౌండ్ కు వచ్చు ప్రజలకు, విద్యార్థిణి, విద్యార్థులకు త్రాగు నీటిని సమకూర్చాలని, జాతీయ భావం పెంపొందేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించేందుకు ప్రతిపాదనలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


**ఏర్పాట్ల పరిశీలన**

భారత గణతంత్ర దినోత్సవ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో చేస్తున్న ఏర్పాట్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి పరిశీలించారు. గ్రౌండ్ లో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసారు. వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల వెంకటేశ్వర్లు, ఏఓ రాంరెడ్డి, తహసిల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీ హబ్‌లో ప్రభుత్వ కార్యాలయాలు..

- **ఆవిష్కరణల కేంద్రం ఇక రిజిస్ట్రేషన్ల అడ్డానా?**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ ప్రతిష్టకు, స్టార్టప్ సంస్కృతికి చిహ్నంగా నిలిచిన టీ హబ్ ఇప్పుడు రాజకీయ చర్చకు వేదికైంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఐటీ నిపుణుల్లో మరియు పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కీలక ప్రభుత్వ కార్యాలయాలను టీ హబ్ భవనంలోకి తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా బేగంపేటలోని కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసును ఇక్కడికి మార్చనున్నారు. శేరిలింగంపల్లి, గండిపేట, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలను కూడా టీ హబ్‌లోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

దేశంలోనే అత్యంత ఆధునిక ఇంక్యుబేటర్ మరియు ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా పేరుగాంచిన టీ హబ్‌ను ప్రభుత్వ ఆఫీసులుగా మార్చడంపై టెక్ నిపుణులు పెదవి విరుస్తున్నారు. వారి వాదనలు ఇలా.. స్టార్టప్ వాతావరణం వేలాది మంది యువ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు తిరిగే చోట సాధారణ ప్రభుత్వ కార్యాలయాలు ఉంటే ఆ 'స్టార్టప్ ఎకోసిస్టం' దెబ్బతింటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల వల్ల సామాన్య ప్రజల తాకిడి విపరీతంగా పెరుగుతుంది. ఇది అక్కడ పని చేసే కంపెనీల గోప్యతకు, పని వాతావరణానికి ఆటంకం కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా టీ హబ్‌కు ఉన్న బ్రాండ్ వాల్యూ తగ్గే ప్రమాదం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టీ హబ్, కేసీఆర్ మార్కు ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది. ఆ ఆనవాళ్లను చెరిపేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విపక్షాలు మరియు విశ్లేషకులు విమర్శిస్తున్నారు. ఒక అంతర్జాతీయ స్థాయి ఇన్నోవేషన్ హబ్‌ను సాధారణ సర్కారీ ఆఫీసుగా మార్చడం అనాలోచిత చర్య అని వారు మండిపడుతున్నారు.

టీ హబ్ అనేది ఒక బిల్డింగ్ మాత్రమే కాదు, అది తెలంగాణ యువత ఆశయాలకు వేదిక. దానిని ప్రభుత్వ కార్యాలయాల కోసం వాడటం వల్ల స్టార్టప్ కల్చర్ కుప్పకూలుతుందని టెక్ విశ్లేషకుల అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, స్టార్టప్ కంపెనీలకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వాడటం సరికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**టీ హబ్‌లో గవర్నమెంట్ ఆఫీసులు!**

ప్రైవేట్ భవనాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలను జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ భవనాలకు తరలించాలని ఉత్తర్వులు. ఈ నేపథ్యంలో బేగంపేటలోని కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసును, శేరిలింగంపల్లి, గండిపేట్, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలను టీ హబ్‌లోకి తరలించాలని ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.

# ఫోన్ ట్యాపింగ్ ఒక డ్రామా

- **సింగరేణి స్కామ్ నుంచి దృష్టి మళ్లించడానికే ఇదంతా**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత పదిహేనేళ్లుగా నేను నా రాష్ట్రం కోసం పని చేశాను. నా ప్రాంతం కోసం మా నాయకులు మాకు ఏ బాధ్యత అప్పగించినా మేము శక్తివంచన లేకుండా నిబద్ధతతో పనిచేశాం. మేము ఎప్పుడూ టైం పాస్ రాజకీయాలు చేయలేదు. ప్రత్యర్థుల కుటుంబాలను, పిల్లలను రాజకీయాల్లోకి లాగలేదు. ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టి వేధించలేదు. మా నాయకుడు కేసీఆర్ మేనిఫెస్టోలో చెప్పని హామీలను కూడా నెరవేర్చిన నాయకుడని తెలిపారు.

రైతు బంధు, కళ్యాణ లక్ష్మి, కెసిఆర్ కిట్ ఇలా ఎన్నో గొప్ప కార్యక్రమాలు మేము ప్రజల కోసం చేశాం. గత రెండేళ్లుగా చూస్తుంటే ఈ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిపోయింది. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సత్తా ఈ ప్రభుత్వానికి లేదు. ఏదో రకంగా కాలక్షేపం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి రోజుకో కొత్త డ్రామా ఆడుతున్నారు. అందులో భాగంగానే ఈ కాలేశ్వరం డ్రామా, గొర్రెల స్కామ్ డ్రామా, ఫార్ములా ఈ డ్రామా, ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు ఆడుతున్నారు. నా అంతరాత్మ సాక్షిగా చెబుతున్నాను నేను ఏనాడూ అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడలేదు. గత ఏడెనిమిది ఏళ్లుగా నా మీద తీవ్రమైన క్యారెక్టర్ అసాసినేషన్ (వ్యక్తిత్వ హననం) జరుగుతోంది. నన్ను ఏదో డ్రగ్స్ కేసుల్లోనో, హీరోయిన్లతో సంబంధాలనో ఇరికించాలని చూశారు. నన్నే కాకుండా నా కుటుంబాన్ని, పిల్లలను కూడా మానసిక క్షోభకు గురి చేశారు. అయినా నేను ఎవరికీ భయపడలేదు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ విషయంలో నన్ను విచారణకు పిలిచారు. నేను వెళ్తాను. నేను అడుగుతాను, మా ప్రభుత్వం ఏం తప్పు చేసిందో, అసలు ఎక్కడ తప్పు జరిగిందో వాళ్ళు సమాధానం చెప్పాలని అన్నారు.

గత రెండేళ్లుగా ఒక సీరియల్ లాగా లీకులు ఇస్తూ నా మీద వ్యక్తిత్వ హననం చేస్తున్న వారు ఎవరో నేను అడుగుతాను. మరి నా పరువుకు, నా ప్రతిష్టకు కలిగిన నష్టానికి ఎవడు బాధ్యుడు? రేవంత్ రెడ్డి బాధ్యుడా? ఈ లీకులు ఇచ్చిన పోలీసువోళ్ళు బాధ్యులా? రాసిన మీడియా వాళ్ళు బాధ్యులా? అని నేను అడుగుతా. అట్లే ఇంకో మాట కూడా నేను అడుగుతా ఇవాళ. ఇవాళ మీరు ఏ అధికారి అయినా, ఈ రాష్ట్రంలో పోలీస్ అధికారో ఈరోజు రాష్ట్రంలో ఫోన్లు ట్యాప్ జరగడం లేదు అని చెప్తాడా? కెమెరా ముందుకు వచ్చి చెప్పే ఒక్క పోలీసువోడు ఉన్నాడా? డీజీపీ శివధర్ రెడ్డి ముందుకు వస్తాడా? ఐజీ ఇంటెలిజెన్స్ ముందుకు వస్తాడా? కమిషనర్ సజ్జనార్ ముందుకు వస్తాడా? అని అన్నారు.

2015లో మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో మా ఎమ్మెల్యే ని ఒకరిని కొనడానికి ఒక దొంగ 50 లక్షల రూపాయల బ్యాగుతో వచ్చి దొరికిండు. దొరికిన తర్వాత ఆ దొంగ మీద ఏమన్నా నిఘా పెట్టిండ్రేమో పోలీసులు మాకేం తెలుసు? మాకేం సంబంధం? పోలీసులు, దొంగలు -- వాళ్లకు వాళ్లకు సంబంధం ఉంటది మాకేం సంబంధం? మధ్యలో రాజకీయ నాయకత్వానికి. ఇవాళ వాస్తవం ఏంది? 2015లో ఏ దొంగనైతే దొరికిండో 50 లక్షల రూపాయలతో -- అడ్డంగా రాష్ట్రం మొత్తం చూస్తుండగా -- ఆ దొంగ ముఖ్యమంత్రి అయి కూర్చున్నాడు. మిగతా వాళ్ళు కూడా నా లెక్కనే రాజకీయ నాయకులందరూ దొంగ పనులు చేస్తారు, మిగతా వాళ్లకు కూడా నా లాగానే బురద అంటించాలి, వాళ్ళను బద్నామ్ చేయాలి. అందుకే విచారణకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తా ఉన్నాడు. ఒక మూడు రోజుల కింద హరీష్ రావు ఒక ప్రెస్ మీట్ పెట్టినారు. సింగరేణి కాలరీస్ ఏదైతే ఉన్నదో అక్కడ వేల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగింది. దానిలో ప్రధాన నిందితుడు రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి. ఈ మొత్తం స్కామ్ చేసింది రేవంత్ రెడ్డి బావమరిదే అని హరీష్ రావు ఆధారాలతో సహా చెప్పరని అన్నారు.

ప్రభుత్వానికి కూడా సింగరేణిలో 49 శాతం వాటా ఉన్నది. కేంద్ర బొగ్గు మంత్రి కిషన్ రెడ్డి కాబట్టి ఆయనన్నా స్పందిస్తాడేమో, ఈ దొంగలను పట్టుకుంటాడేమోఅని రేవంత్ రెడ్డి ఆయన దొంగ కాబట్టి, అడ్డంగా దొరికిన దొంగ కాబట్టి, ఇంకా దొంగ పనులు చేస్తూనే ఉన్నాడు ఇంకా విచిత్రం ఏంటంటే, ఇవాళ ఒక్క దొంగ లేడు ఈ రాష్ట్రంలో, దండుపాళ్యం ముఠా లెక్క.. క్యాబినెట్, క్యాబినెట్ ఎవరైతే ఉన్నారో అందరూ అందినకాడికి దోచుకొనే స్కీమ్ లో భాగంగా ఈరోజు వాళ్ళు దోచుకుంటున్నారు. ఆ దోపిడీని మేము బయట పెడుతుంటే వాళ్లకు ఎక్కడలేనీ మంట, తప్పు చేసినవాడు భయపడతాడు, తప్పు చేయనోళ్లు ఎవరికీ భయపడరు. రేవంత్ రెడ్డి కాదు ఆయన జేజమ్మ కూడా భయపడే సమస్య లేదు. ముమ్మాటికి ఒక్కటి మాత్రం పక్కా. ఈ కేసు ఇంతటితో మేము వదిలిపెట్టం. నా క్యారెక్టర్ అస్సాసినేషన్?కు బాధ్యులైన రేవంత్ రెడ్డిని, ఆయన తొత్తులుగా పనిచేస్తున్న పోలీసులు, కొంతమంది అందరినీ కాదు, కొంతమంది పోలీసులు ఎవరైతే ఉన్నారో ఆయన తొత్తులుగా ఆయన అడుగులకు మడుగులొత్తుతూ పనిచేస్తున్నారో వాళ్ళని నేను కూడా వదిలిపెట్టనని హెచ్చారించారు.

మీరు ఎన్నిసార్లు పిలిచినా వస్తాం. చట్టాన్ని గౌరవించే పౌరులం, తప్పకుండా వస్తాం. మేము తప్పు చేయలేదు, చేయలేదన్న మాటనే చెప్తాం. మీరు ఎన్ని రకాల డైవర్షన్ గేమ్ లాడినా మేము మాత్రం అర్జునుడి కన్ను ఎట్లయితే ఆనాడు తన గురి మీదే ఉందో, అట్లే మా గురి మొత్తం కూడా ఈ ప్రభుత్వ అసమర్థత మీద, మీ అవినీతి మీద, మీరు ప్రజలకి ఇచ్చిన ఎగ్గొడుతున్న హామీల మీద ఉంటది. ఎనుముల రేవంత్ రెడ్డి, ఎగవేతల రేవంత్ రెడ్డిగా ఎట్లా మారిపోయాడో అన్న దాని మీద.. 420 హామీలు ఇచ్చి ఇప్పటివరకు నాలుగు హామీలు కూడా నెరవేర్చకుండా ఎట్లా ఈ లుచ్చా పనులు చేస్తున్నాడో వీటికి ఎండగడుతూనే ఉంటాం. 100% వదిలిపెట్టకుండా ప్రాణం పోయేదాకా పోరాడుతూనే ఉంటామని అన్నారు.

ఎవరికీ భయపడకుండా ఎవరికీ తలవంచకుండా నిఖార్సైన తెలంగాణ బిడ్డలుగా కేసీఆర్ సైనికులుగా, కేసీఆర్ ని తిరిగి ముఖ్యమంత్రి చేసేదాకా మేమందరం కలిసికట్టుగా పనిచేస్తా ఉంటామని, మళ్ళీ ఆయనను ముఖ్యమంత్రిని చేసే వరకు విశ్రమించేది లేదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. సంఘీభావం చెప్పడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మరొక్కసారి ధన్యవాదాలని తెలియజేశారు.

## ఇరాన్‌పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు

- **పశ్చిమాసియాలో అమెరికా సైనిక మోహరింపులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరుగుతున్నాయి. అమెరికా కీలక సైనిక మోహరింపులకు దిగింది. విమాన వాహక నౌకలు, యుద్ధ విమానాలు సహా భారీ మిలిటరీ హార్డ్‌వేర్‌ను తిరిగి ఈ ప్రాంతానికి తరలిస్తోంది. ఇరాన్‌పై దాడి అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి మిశ్రమ సంకేతాలు వెలువడుతున్నాయి.

తమపై దాడి జరిగితే, పశ్చిమాసియా మొత్తం విస్తృత స్థాయి సైనిక ఘర్షణలో కూరుకుపోతుందని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయెల్ ఆకస్మిక యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికన్ మీడియా కథనాల ప్రకారం, మిడిల్ ఈస్ట్?లో కార్యకలాపాలను పర్యవేక్షించే యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్?ను అమెరికా మరింత బలోపేతం చేస్తోంది. ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు, విమాన వాహక నౌక యూఎస్?ఎస్ అబ్రహాం లింకన్?ను ఇరాన్?కు సమీప ప్రాంతాల్లో మోహరించింది. ఈ ప్రాంతంలో అమెరికా తన ఎయిర్, మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా పటిష్టం చేసింది. గురువారం ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ వైపు 'బిగ్ ఫోర్స్' కదులుతున్నట్లు తెలిపారు. "ఏదో జరుగుతుందని కాదు కానీ, ఇరాన్?ను మేం అత్యంత సన్నిహితంగా గమనిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు.

**ఇజ్రాయెల్ అప్రమత్తం**

ఎయిర్ అండ్ స్పేస్ ఫోర్సెస్ మ్యాగజైన్ కథనం ప్రకారం, అమెరికన్ వాయుసేనకు చెందిన 12 ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ జెట్స్?ను యూకే నుంచి జోర్డాన్ వాయుసేన స్థావరాలకు తరలించారు. వీటితో పాటు కేసీ-135 ఏరియల్ రీఫ్యూయలర్స్, సీ-130 కార్గో విమానాలు కూడా చేరాయి. ఎఫ్-15ఈ విమానాలు బహుముఖ పోరాట సామర్థ్యం కలవిగా పేరొందాయి. గత ఏడాది ఇరాన్‌తో 12 రోజులపాటు జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్, అమెరికా ఈ విమానాలను ఉపయోగించాయి. ఇరాన్ నుంచి ప్రయోగించిన డ్రోన్లను తిప్పికొట్టడంలో ఇవి కీలక పాత్ర పోషించాయి.



అమెరికా ఇరాన్‌పై దాడి చేస్తే, తమపై ఇరాన్ ప్రతిదాడి జరిగే ప్రమాదం ఉందని ఇజ్రాయెల్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తున్నట్లు ఇజ్రాయెల్ భద్రతా అధికారులు తెలిపారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సైనిక, పోలీసు, అత్యవసర సేవలు, పౌర పాలనా యంత్రాంగాలను సిద్ధంగా ఉంచారు. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థను హై అలర్ట్‌లో ఉంచినట్లు వెల్లడించారు.